# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- మానవాళి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రపంచ శాంతి అవసరమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఉద్ఘాటించారు.
- వామపక్ష ప్రభావిత రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశం రేపు ఢిల్లీలో జరుగుతుంది.
- భారత దేశంలో 5 రోజుల పర్యటన కోసం మాల్దీవుల అధ్యక్షులు మహమ్మద్ ముయిజ్జు ఈ రోజు ఢిల్లీ చేరుకున్నారు.
- వైమానిక దళ దినోత్సవంలో భాగంగా భారత వైమానిక దళం చెన్నై లో భారీ విన్యాసాలు నిర్వహించింది.
- మహిళల టీ - 20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో పాకిస్తాన్ పై భారత్ విజయం సాధించింది.

=========================

మానవాళి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రపంచ శాంతి అవసరమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. అంతర్జాతీయ న్యాయస్థానం I.C.J, ICW కి రాసిన లేఖలో ఆయన ఈ విషయం పేర్కొంటూ... దేశాల మధ్య ఐక్యత నెలకొని ఉండడం ఎంతైనా అవసరమని అన్నారు. ఈ ఐక్యతా, పరస్పర భాగస్వామ్యం ద్వారానే సామూహిక ప్రయత్నాల విజయం ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి సాధించడానికి విధానాలు రూపొందించే కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తులు, మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రచయితలు, సంపాదకులు, న్యాయ విద్యా వేత్తల భాగస్వామ్యం ఎంతో కీలకమని నరేంద్ర మోడీ ఆ లేఖలో పేర్కొన్నారు.

=========================

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఢిల్లీలో రేపు వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరుగనున్నది. దేశంలో వామపక్ష తీవ్రవాద సమస్యను 2026 మార్చి నాటికి సమూలంగా పరిష్కరించే ఉద్దేశ్యంతో కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో సంబంధిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు, హోం

శాఖ మంత్రులు, పోలీసు డైరెక్టర్ జనరల్స్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 6వ తేదీన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్య మంత్రులతో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఈ సమావేశం నిర్వహించారు. దేశంలో వామపక్ష తీవ్రవాదం నిర్మూలనకు సంబంధించి అమిత్ షా పలు సమగ్ర ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యల కారణంగా దేశ వ్యాప్తంగా నక్సలైట్ల హింసా కార్యకలాపాలు 72 శాతం మేర తగ్గడం విశేషం. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణా రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో 5 రోజుల పర్యటన కోసం మాల్దీవుల దేశాధ్యక్షులు మహమ్మద్ ముయిజ్జు ఈ రోజు ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా తన సతీమణితో కలిసి వచ్చిన ఆయన పలు అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జై శంకర్ తదితరులతో ముయిజ్జు సమావేశమవుతారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తాజ్ మహల్ ను కూడా ఆయన సందర్శిస్తారు. ముంబై, బెంగలూరు నగరాలలో జరిగే పలు వాణిజ్య సమావేశాలలో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల (MDBల) బలోపేతంపై జీ-20 ఇండిపెండెంట్ నిపుణుల బృందం నుండి వచ్చిన 30 సిఫార్సులలో 27 సిఫార్సులను ప్రపంచ బ్యాంక్ పరిగణనలోకి తీసుకోవడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించారు.

ఢిల్లీలో ప్రొఫెసర్ నిక్ స్టెర్న్ తో ఆమె సమావేశం నిర్వహించిన సందర్భంగా ఈ విషయం చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలకు క్లైమేట్ ఫైనాన్స్, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడం అత్యంత ప్రతిష్టాత్మకమైన వాతావరణ చర్యను ప్రారంభించడానికి చాలా ముఖ్యమైనదని ఆమె చెప్పారు. ప్రొఫెసర్ నిక్ స్టెర్న్ భారతదేశం జీ- 20 ప్రెసిడెన్సీ సమయంలో స్థాపించబడిన MDBలను బలోపేతం చేయడంపై స్వతంత్ర నిపుణుల బృందంలో సభ్యుడిగా వ్యవహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా నవరాత్రి వేడుకలు జగుగుతున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూష్మాండ దేవిని ప్రార్థించారు. నవరాత్రుల సందర్భంగా దేశ ప్రజలకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కూష్మాండ దేవిని ప్రార్థిస్తున్నానని నరేంద్ర మోడీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో చిరుతలకు నిలయమైన మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని కునో జాతీయ పార్కును సందర్శకుల కోసం తిరిగి తెరిచారు. భారీ వర్షాల కారణంగా దీని సందర్శనను నిలిపి వేశారు. అయితే... చిరుతలను ఇంకా అడవులలోకి వదలక పోవడంతో వాటిని తిలకించేందుకు మరిన్ని రోజులు వేచి చూడాలని పార్కు నిర్వాహకులు తెలిపారు. దేశంలో చిరుతలు అంతరించి పోతున్న తరుణంలో 2022వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నమీబియా, దక్షిణాఫ్రికా దేశాల నుండి 20 చిరుతలను తీసుకువచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“వికసిత్ భారత్” సాధించే దిశగా చేస్తున్న కృషిలో ఏక కాల ఎన్నికలు నిర్వహించడం వల్ల భారత దేశం ఎంతో ప్రయోజనం పొందుతుందని పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అన్నారు. ఏక కాల ఎన్నికలపై ఢిల్లీలో 30వ లాల్ బహదూర్ శాస్త్రి స్మారకోపన్యాసం చేస్తూ... ఏక కాల ఎన్నికల వల్ల మెరుగైన పాలన, విధాన స్థిరత్వం, సామాజిక ఐక్యత, ఆర్థిక వృద్ధి, ప్రపంచ పోటీతత్వం వంటి దీర్ఘ కాలిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళం చెన్నై నగరంలోని మెరీనా బీచ్ లో ఈ రోజు వైమానిక విన్యాసం నిర్వహించింది. ఈ నెల 8వ తేదీన ఇక్కడ జరగనున్న 92వ వైమానిక దళ దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా ఈ విమాన విన్యాసాలు నిర్వహించినట్టు వైమానిక దళాధికారులు తెలిపారు. రఫెల్, సు 30, మిగ్, జాగ్వర్, తేజస్ మొదలైన 72 రకాల విమానాలను ప్రదర్శిస్తున్నారు. భారత వైమానిక దళం గరుడ్ కమాండోలు కూడా తమ విన్యాసాలు నిర్వహించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.కె. స్టాలిన్, ఉప ముఖ్య మంత్రి ఉదయ నిధి స్టాలిన్, వైమానిక దళ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వైమానిక విన్యాశాల సందర్భంగా మెరీనా బీచ్ జనసంద్రమైంది. ఈ నేపథ్యంలో జరిగిన తొక్కిసలాటలో పలురువు గాయపడినట్లు తెలుస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకున్న భక్తులను మాత్రమే ఇక నుండి శబరిమల యాత్రకు అనుమతించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. వార్షిక మండలం - మకర విలక్కు యాత్ర వచ్చే నెల నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ముఖ్య మంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన తిరువనంతపురంలో నిన్న జరిగిన ఉన్నత స్థాయీ సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులు ముందుగా ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకోవాలని ముఖ్య మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ప్రతి రోజు 80 వేల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హైదరాబాదు నగరం నుండి గోవా వెళ్ళే పర్యాటకుల కోసం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సికింద్రాబాదులో ఈ రోజు కొత్త రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన రెగ్యులర్ సర్వీసులు సికింద్రాబాదు నుండి ఈ నెల 9వ తేదీన, వాస్కోడిగామా నుండి 10వ తేదీన ప్రారంభమవుతాయి. సికింద్రాబాదు - వాస్కోడిగామా రైలు ప్రతి బుధ, శుక్ర వారాలలో, వాస్కోడిగామా - సికింద్రాబాదు రైలు ప్రతి గురు, శనివారాలలో నడుస్తాయి. ప్రస్తుతం సికింద్రాబాదు - వాస్కోడి గామా మధ్య రెగ్యులర్ సర్వీసు ఉంది. ఈ రైలు మంగళ, బుధ, శుక్ర, ఆదివారాల్లో నడుస్తోంది. ప్రయాణికుల నుండి ఒత్తిడి ఉండడంతో ఈ రైలును అదనంగా ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా జరుగుతున్న మహిళల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ పోటీలో టీమిండియా పాకిస్తాన్ పై విజయం సాధించింది. తొలి మ్యాచ్ లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన భారత్, ఈ రోజు తన చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ పై 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ విజయంతో సెమీస్ అవకాశాలను సురక్షితంగా ఉంచుకుంది. ఈ మ్యాచ్ లో తొలుత పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత జట్టు 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి చేదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మూడు టీ - 20 సిరీస్ లలో భాగంగా భారత్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య గ్వాలియర్ లో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లో భారత్ కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. కడపటి వార్తలు అందే సమయానికి బంగ్లాదేశ్ జట్టు 8 వికెట్ల నష్టానికి 17 ఓవర్లకు 115 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబై మెట్రోలో ప్రయాణించిన సందర్భంగా తన జ్ఞాపకాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ రోజు సమాజిక మాద్యమం ఎక్స్ వేదికగా ప్రజలతో పంచుకున్నారు. ముంబై మెట్రో ప్రయాణం మంచి జ్ఞాపకాలను అందించిందని, చక్కని అనుభూతిని మిగిల్చిందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ రోజు "ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ అవగాహనా దినం" నిర్వహిస్తున్నారు. సెరిబ్రల్ పాల్సీ అంటే మస్తిష్క పక్ష వాతం. ఇది నరాలకు సంబంధించిన వ్యాధి. కొందరికి పుట్టుకతో..., మరి కొందరికి తలకు గాయమైనపుడు ఈ వ్యాధి సంభవిస్తుంది. జన్యు పరమైన లోపాలే ఈ వ్యాధికి ప్రధాన కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి వెయ్యి మంది పిల్లలలో ముగ్గురికి మస్తిష్క పక్ష వాతం ఉన్నట్టు పలు వైద్య నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వ్యాధి ఉన్న పిల్లలు దొర్లడం, కూర్చోవడం, నడవడం ఆలస్య మవుతాయి. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి మందులు, శస్త్ర చికిత్స, స్పీచ్ థెరపీ వంటి చికిత్సల ద్వారా కొంత వరకు అరికట్టవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ పాలనలో దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని సమాజిక మాద్యమ వేదిక "ఎక్స్" లో పేర్కొన్నారు. అసంఘటిత రంగాన్ని విస్మరించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని, దేశంలో వస్తు తయారి అన్న విధానం విఫలమైందని ఖర్గే విమర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =